క్లుప్తంగా

ఘనంగా దుర్గామాత ఆగమన్

ఆమనగల్లు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి దుర్గాభవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గామాత ఆగమన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా మండపం వద్దకు తీసుకువచ్చారు. బాణ సంచాలు కాలుస్తూ సందడి చేశారు.

కొండా లక్ష్మణ్‌కు ఘననివాళి



బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి.. ఆదివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఆయన విగ్రహానికి ఎంపీడీఓ కుసుమమాధురి, సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్కండేయ దేవాలయ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు గాజుల శ్రీను, మాజీ కౌన్సిలర్ చెన్న కేశవులు, పద్మశాలి సంఘం నాయకులు శ్రీనివాస్, శివలింగం, వాసు, పాండు, అప్పి, నిరంజన్, చంద్రమౌళి, శ్రీధర్, శ్రీను, రమేశ్, సత్తయ్య పాల్గొన్నారు.

పీసీసీ అధికార ప్రతినిధికి పరామర్శ



రతన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్ తండ్రి రతన్‌సింగ్ ఇటీవల మృతిచెందారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అద్దాల మహేందర్‌గౌడ్, కొప్పుల ఆంజనేయులుగౌడ్‌లు బాలాజీసింగ్‌ను కల్వకుర్తిలోని ఆయన నివాసంలో పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భక్తిభావంతో మానసిక ప్రశాంతత



హోమం నిర్వహిస్తున్న పండితులు

కందుకూరు: నిత్యం కొంత సమయాన్ని భగవంతుడి సేవలో గడపాలని, దీంతో మానసిక ప్రశాంతతో పాటు, సమస్యలను ఎదుర్కొనే ధైర్యం వస్తుందని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి అన్నారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని పులిమామిడి పరిధి నిఖిల్ చేతనా కేంద్రంలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఆటుపోట్లను ఎదుర్కోవాలంటే సాధనకు మించిన మార్గం మరొకటి లేదని తెలిపారు. భక్తి పెంచుకోవడంతో పాటు.. తోటి వారితో స్నేహంగా మెలగాలని సూచించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి

యాచారం: ఫార్మాసిటీ భూసేకరణలో అధికారులు హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భూసేకరణ, ఫెన్సింగ్ పనుల్లో కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. రైతులకు నష్టం జరిగేలా వ్యవహరిస్తే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

దత్తాత్రేయుడి సన్నిధిలో కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: కర్నాటక రాష్ట్రం గానుగాపూర్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ దత్తాత్రేయస్వామి దేవాలయాన్ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డిలు ఉన్నారు.

దసరా వేడుకల సందడి



ఆమనగల్లు: రాజరాజేశ్వరి దేవి మూలవిరాట్





కడ్తాల్: మైసిగండి శివ రామాలయంలో కొలువైన అన్నపూర్ణేశ్వరిదేవి, మైసమ్మ

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు, అమ్మవారి మండపాలు ముస్తాబయ్యాయి. ఏటా ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి గడియలు ప్రవేశించడంతో కార్యక్రమాలకు అంకురార్పణ చేస్తారు. నేటి నుంచి 13 రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

- నేటి నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు
- ముస్తాబైన దేవాలయాలు
- సిద్ధమైన మండపాలు



కడ్తాల్: మైసిగండి శివ రామాలయం

ఆమనగల్లు: భక్తమార్కండేయస్వామి ఆలయం రాజరాజేశ్వరి ఉత్సవాలకు ముస్తాబైంది. నేటి నుంచి అక్టోబర్ 4 వరకు వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. తొలుత నేడు బాలాత్రిపుర సుందరిగా పూజలు అందుకోనున్నారు. 23న గాయత్రి, 24న అన్నపూర్ణ, 25న లలితాత్రిపుర సుందరి, 26న కాత్యాయని, 27న మహాచండి, 28న శ్రీమహాలక్ష్మి, 29న మహాసరస్వతి, 30న మహాదుర్గ, అక్టోబర్ 1న మహిషాసుర మర్దిని, 2న రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా 4న దుర్గాదేవి శోభాయాత్ర నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణయ్య తెలిపారు. వాసవీ కన్యకా పరమేశ్వరి సన్నిధిలో ఉత్సవాలకు ఏర్పాటు పూర్తి చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్ తెలిపారు. రోజుకో రూపంలో అమ్మవారు దర్శనమివ్వనున్నారని పేర్కొన్నారు. శ్రీనివాస కాలనీలో దుర్గాభవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. మండల పరిధి కోనాపూర్‌లో దుర్గామాత సేవా సమితి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరపనున్నారు.

భక్తుల కొంగు బంగారం మైసమ్మ

కడ్తాల్: భక్తుల కొంగు బంగారమైన మైసిగండి మైసమ్మ, శివాలయ రామాలయం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. నేటి నుంచి అక్టోబర్ 2 వరకు వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఈఓ స్నేహలత, ఫౌండర్ ట్రస్టీ శిరోలీ పంతునాయక్ తెలిపారు. ఉత్సవాల నేపథ్యంలో అన్నపూర్ణేశ్వరి, మహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి దేవీ రోజుకో రూపంలో దర్శనమివ్వనున్నారు. నేడు 22న అన్నపూర్ణదేవిగా పూజలు అందుకోనున్నారు. 23న బాలత్రిపుర, 24న గాయత్రి, 25న భవాని, 26న లలితాత్రిపుర సుందరి, 27న మహాలక్ష్మి, 28న మహాచండీ హోమం, 29న సరస్వతి, 30న కనకదుర్గ, 1న మహిషాసుర మర్దని, 2న రాజరాజేశ్వరి అలంకరణలో అలరించనున్నారు.

రవాణా సౌకర్యం

హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలో మైసమ్మ ఆలయం కలదు. ఇమ్లిబన్ బస్‌స్టాండ్ నుంచి ప్రతి ఐదు నిమిషాలకు బస్సు సౌకర్యం ఉంది. నల్గొండ ఎక్స్‌రోడ్, ఐ.ఎస్.సదన్, సంతోష్‌నగర్, చాంద్రాయనగుట్ట నుంచి బస్సులు ఉన్నాయి. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట్ నుంచి రవాణా సౌకర్యం ఉంది.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

సీపీఎం డివిజన్ కార్యదర్శి రాజు



పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు, రైతులు

షాద్‌నగర్: ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే మార్చాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి ఎన్.రాజు డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పరిధిలోని అయ్యవారిపల్లి, చించోడ్, భీమారం, ఉప్పరిగడ్డ తండాల మీదుగా రీజనల్ రింగ్ రోడ్డును నిర్మించే ప్రాంతాలను ఆదివారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడి పంట పొలాలను సందర్శించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. రైతులు పంటలు పండించే పచ్చని పంట పొలాల గుండా రోడ్డును నిర్మించడం సరికాదన్నారు. పాడి పంటలు, వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఆయా గ్రామాల్లో రైతులు సుమారు 300 ఎకరాల భూమిని కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం గతంలో చేసిన మార్కింగ్ ప్రకారమే రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం చేస్తే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు శ్రీనునాయక్, సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య, చంద్రకాంత్, రజినీకాంత్, సత్యం, సాయన్న, సత్తయ్య, శ్రీధర్‌నాయక్, సూర్యనాయక్, భాస్కర్, హరీష్, శ్రీకాంత్, వెంకటయ్య, మాధవి, నవీన్ తదితరులు ఉన్నారు.

వీసా ఫీజు పెంపుతో విద్యార్థులకు నష్టం

చేవెళ్ల: అమెరికా ప్రభుత్వం ప్రకటించిన హెచ్–1బీ వీసా ఫీజు పెంపు నిర్ణయం సరైంది కాదని బీజేపీ చేవెళ్ల యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యువ విద్యార్థులైన ఐటీ, వైద్యులు, ఇంజనీర్లు వంటి ప్రతిభావంతులకు భారీ ఆర్థిక భారంగా మారుతుందన్నారు. మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల అమెరికా కలలను సాకారం చేయటంలో అడ్డంకిగా మారిందన్నారు. అలాగే నగరంలోని ట్యాంక్‌బండ్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన 3కే రన్‌లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నంతో పాల్గొన్నానని చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరుపేదలకు వరమని, ఆపద కాలంలో అండగా నిలుస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధి గ్రామాలకు చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను.. ఆదివారం నగరంలోని తన నివాసంలో బాధితులకు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటనర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడురు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ నాయకులు గోలి సురేందర్‌రెడ్డి, జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకే ముఖ్యం

బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తయ్య



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

కందుకూరు: కాంగ్రెస్ పార్టీకి బీసీల పట్ల నిజమైన ప్రేమ లేదని, ఓటు బ్యాంకు కోసమే 42 శాతం రిజర్వేషన్లని ఆ పార్టీ నేతలు చెబుతున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలపై ప్రేమ ఉంటే.. ఆ వర్గం బిడ్డలైన కందుకూరు, మహేశ్వరం మండలాల పీఏసీఎస్ చైర్మన్లు చంద్రశేఖర్, పాండుయాదవ్‌ను తొలగించి, ఓసీలను ఎలా నియమించారని ప్రశ్నించారు. ఇలా చేస్తూ.. రిజర్వేషన్లు కల్పిస్తామంటే ఎలా నమ్మాలన్నారు. బీసీ సంఘం మండల ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, కురుమ సంఘం మండల అధ్యక్షుడు పాండు, కుమ్మర సంఘం అధ్యక్షుడు రవి, వడ్డెర సంఘం అధ్యక్షుడు శ్రీరాములు, రజక సంఘం జిల్లా నాయకుడు బి.మల్లేశ్, మాజీ సర్పంచ్ గణేశ్, బీసీ నాయకులు రమేష్, జి.అంజయ్య, పి.కృష్ణ, శ్రీ కాంత్, అనిల్, రావిచెట్టు రవీందర్ పాల్గొన్నారు.

జీఎస్టీతో ప్రజలకు మేలు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: గ్రామీణ భారతాన్ని జీఎస్టీ సంస్కరణలు మార్చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్‌నగర్ ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో ఆదివారం పేర్కొన్నారు. పన్నుల మార్పులు మాత్రమే కాకుండా పశుపోషణ, మత్స్యకార వృత్తి, మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ కుటుంబాల జీవనోపాధిపై నేరుగా ప్రభావం చూపుతుందన్నారు. ఇప్పటి వరకు రైతులు ఉపయోగిస్తున్న పరికరాలపై 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి వచ్చిందని, ప్రధాని నరేంద్రమోదీ తీసుకువచ్చిన కొత్త సంస్కరణల ద్వారా ఐదు శాతానికి తగ్గిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ నిర్ణయం అందరికీ ఆదర్శంగా ఉందన్నారు.

నేటి విద్యార్థులే భవిష్యత్తు నిర్మాతలు



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు. చిత్రంలో ప్రొఫెసర్ కృష్ణయ్య తదితరులు

హయత్‌నగర్: నేటి విద్యార్థులే భవిష్యత్తు నిర్మాతలు. దేశ భవిష్యత్తు వారి చేతుల్లో ఉందని ఉస్మానియ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కృష్ణయ్య అన్నారు. చదువుతో పాటు.. సామాజిక కార్యక్రమాలలో పాల్గొనాలని, ఇందుకు ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆదివారం బేగంపేట్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులు తట్టిఅన్నారంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ క్యాంపు ముగింపులో ఆయన మాట్లాడారు. ఈ క్యాంపులో గ్రామస్తుల స్థితి గతులను, వారి జీవన శైలిని విద్యార్థులు ప్రత్యక్షంగా చూశారని, దీంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారికి అవగాహన వస్తుందని పేర్కొన్నారు. మాజీ కౌన్సిలర్ గీతా మాట్లాడుతూ.. పారిశుద్ధ్య నిర్వహణ, జల సంరక్షణ, అంటురోగాలు, మహిళల విద్య, మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారని తెలిపారు. ఇది గ్రామస్తులకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. క్యాంపు పీఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, రవితేజ, రోహిణి, అర్చన, మీన, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



మంచాల: ఆరుట్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మాడ్గుల: ఇర్విన్‌లో బతుకమ్మలతో మహిళలు



ఆమనగల్లులో..



ఇబ్రహీంపట్నం రూరల్: పోల్కంపల్లిలో..



ఆమనగల్లు: నెత్తిన పూలగోపురంతో యువతి



యాచారం: నక్కర్తమేడిపల్లిలో వర్షంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చిత్తూచిత్తూల బొమ్మ..

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబురాలు ప్రారంభం అయ్యాయి. తొలిరోజు ఆదివారం ఎంగిలి పూల బతుకమ్మ పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆడబిడ్డలు తంగేడు, గునుగు, బంతి, చేమంతి తదితర పుష్పాలతో పూలగోపురాలను అందంగా పేర్చారు. వీధుల్లో ప్రతిష్టించి, చిత్తూచిత్తూల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ.. బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన అంటూ.. ఆడిపాడారు. వరుణుడు అంతరాయం కలిగించినప్పటికీ.. వర్షంలో పూల సింగిడిలతో సందడి చేశారు. అనంతరం చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. – సాక్షి, నెట్‌వర్క్



మంచాల: ఆరుట్లలో బతుకమ్మతో చిన్నారి



కడ్తాల్‌లో..



ఆమనగల్లు: హనుమాన్ ఆలయ ప్రాంగణంలో..

అమావాస్య వేడుకలు



పల్లకిలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

తుక్కుగూడ: జెన్నాయిగూడ ఛత్రగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఆలయ మాడ వీధుల్లో పల్లకిలో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈఓ శ్రీనివాసరావు, పూజారులు అజయ్‌శర్మ, మురళిశర్మ, భక్తులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ గోమాతను పూజించాలి

షాద్‌నగర్‌రూరల్: సకల దేవతల నిలయమైన గోమాతను ప్రతిఒక్కరూ పూజించాలని వాసవీక్లబ్ అధ్యక్షుడు కల్వమాణిక్యం అన్నారు. మహాలయ అమావాస్యను పురస్కరించుకొని పట్టణ సమీపంలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలోగల శ్రీకృష్ణ గోశాలలో ఆదివారం వాసవీ, వనితాక్లబ్ ఆధ్వర్యంలో గోపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని అన్నారు. గో సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వనితాక్లబ్ అధ్యక్షురాలు కల్వమధుప్రియ, వాసవీ క్లబ్ కోశాధికారి సురేష్ కుమార్, జోన్ చైర్మన్ వెంకటరమణ, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులుగుప్తా, సభ్యులు నందకిషోర్, మురళి, రవికుమార్, పాండు, శ్రీనివాస్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.